# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## విద్యార్థులకు అధ్యాపకుడుగా ఇఓ భరోసా !



తిరుపతి, ఆగస్టు 22ప్రభాతవార్త:
నిర్దిష్టమైన ఆశయాలతో ,చక్కటి ప్రణాళికతో లక్ష్యాలను సాధించుకోవాలని అధ్యాపకుడుగా టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి విద్యార్థులకు ప్రత్యేక హితవు చేశారు. తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి ఆర్ట్సు కళాశాలను సోమవారం ఉదయం ఆయన ధర్మారెడ్డి సందర్శించి, ఇక్కడ విద్యార్థులతో మమేకమయ్యారు. మంచిస్థాయికి ఎదిగేందుకు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు.

## నేడు, రేపు ప్రత్యేక ఆధార్ నమోదు

### 5 నుండి 15 సంవత్సరాలలోపు పిల్లల కోసం 71 కేంద్రాలు

### - కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:
ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేసుకోని 5 నుండి 15 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ నమోదు కోసం మంగళ, బుధవారాల్లో ఆధార్ నమోదు కోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకంగా 71 ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటికే ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని దీనితో పాటు జిల్లాలోని 31 మండలాల పరిధిలో ప్రత్యేకంగా మరో 71 ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైతే పిల్లలకు ఇంకా ఆధార్ నమోదు చేసుకోలేదో అలాంటి వారు ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# భార్యాభర్తల అనుమానాస్పద మృతి!



మృతదేహాల వద్ద విచారిస్తున్న పోలీసులు

చిట్టమూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త
చిట్టమూరు మండలంలోని కొక్కుపాలెం సమీపంలోని రొయ్యల చెరువుల వద్ద మల్లాం పంచాయతీ గంగాయగుంట గిరిజన కాలనీకి చెందిన భార్యాభర్తలైన వెంకటేష్ (18), వెంకటరమణమ్మ (16) అనుమానాస్పదంగా మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గిరిజన కులానికి చెందిన వెంకటేష్, వెంకటరమణమ్మలు గత కొద్దిరోజుల నుంచి రొయ్యల చెరువుల వద్ద పనిచేసేవారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి, అప్పుల బాధలు తట్టుకోలేక మూడురోజుల నుంచి కనిపించకపోవడంతో బంధువులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కొక్కుపాలెం సమీపంలోని పులిబొంద ప్రాంతంలో రొయ్యల చెరువులో శవాలై తేలుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వాకాడు సీఐ హరికృష్ణ, చిట్టమూరు ఎస్ఐ గోపి పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రాంతంలో మద్యం సీసాలు పడి ఉన్నట్లు గుర్తించారు. మద్యంలో విషపు గుళికలు కలుపుకొని తాగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం వాకాడు మండలం బాలిరెడ్డిపాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన తెలిపారు.

### రోడ్డు ప్రమాదాల కట్టడికి

# పక్కా ప్రణాళిక

### అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్



ఎస్పీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:
రోడ్డు ప్రమాదాల కట్టడికి పక్కా ప్రణాళిక రచించి అమలు చేయాలని అనంతపురం రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతపురం రేంజ్ డిఐజి కార్యాలయం నుండి సోమవారం డిఐజి ఎం.రవిప్రకాష్ అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీ, ఎఎస్పీ, డిఎస్పీలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డిఐజి మాట్లాడుతూ డిఎస్పీలు, రవాణా శాఖ అధికారులు, జాతీయ, రాష్ట్రీయ రహదారుల ఇంజనీర్లు సంయుక్తంగా కలిసి బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే జాతీయ, రాష్ట్రీయ రహదారుల్లో వాహనాల వేగం నియంత్రించడానికి డ్రమ్స్, స్టాపర్స్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపుల వున్న పొదలను తొలగించాలన్నారు. హత్యా ఘటనల కంటే రోడ్డు ప్రమాదాల్లో అత్యధికులు మృతి చెందుతున్నారని దీనిని దృష్టిలో వుంచుకొని ప్రమాదాల కట్టడికి పోలీసులు పక్కాగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో అనంతపురం, శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప కాగివెల్లి, రాహుల్‌దేవ్‌సింగ్, పరమేశ్వర్‌రెడ్డిలు, ఎఎస్పీలు, డిఎస్పీలు వారి కార్యాలయాల నుండి పాల్గొన్నారు.

## స్పందనకు 119 అర్జీలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:
ప్రజా సమస్యల పరిష్కారం కోసం జిల్లా సచివాలయంలో ప్రతి సోమవారం కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం వివిధ ప్రాంతాల ప్రజల నుండి సమస్యలపై 119 అర్జీలు అధికారులకు అందాయి. ప్రజల నుండి వచ్చిన సమస్యలను కలెక్టర్ హరినారాయణన్ పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 85 అర్జీలు అధికారులకు అందగా, హౌసింగ్ 6, ఆరోగ్యశాఖ 5, సంక్షేమ శాఖలు 4, చిత్తూరు నగర పాలకసంస్థ 3, పోలీసు శాఖ 3, ఇతర శాఖలకు సంబంధించి 13 అర్జీలు అధికారులకు అందాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్పందన అర్జీలను పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్



అర్జీదారుల నుంచి వినతి పత్రాలు అందుకుంటున్న కలెక్టర్, జేసీలు

తిరుపతి కలెక్టరేట్,
ఆగష్టు 22 ప్రభాతవార్త :
స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధి లోపల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో శ్రీనివాసరావు పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం అర్జీలు 91 రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 65, పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 8, డీసీహెచ్ఎస్‌కు సంబంధించి ఒకటి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సంబంధించి మూడు, పోలీస్‌శాఖకు సంబంధించి ఒకటి, బీసీ సంక్షేమ శాఖకు సంబంధించి ఒకటి, గురుకుల పాఠశాలకు సంబంధించి తొమ్మిది, మైనార్టీ శాఖకు సంబంధించి ఒకటి అర్జీలు రావడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం జగన్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్షిస్తున్నారని, జిల్లా అధికారులు వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు గైకొని పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## గ్రానైట్ లారీ బోల్తా

### - ఒకరు మృతి



వెదురుకుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త :
గ్రానైట్ లారీ బోల్తాపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు .... మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ ఎర్రగుంట సమీపంలో పచ్చికాపల్లం నుంచి తిరుపతి వైపు గ్రానైట్‌తో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడటంతో ప్రమాదం నుంచి బయటపడాలని లారీ నుంచి ఓ వ్యక్తి దూకడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు కర్నూలు జిల్లా డోన్ మండలం పాతపేటకు చెందిన లేట్ లక్ష్మణయ్య కుమారుడు బి.జ్ఞానయ్య(47)గా గుర్తించారు. గ్రానైట్ లారీలో తన బావతో కలిసి పనిచేసేవాడన్నారు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు ఘటన పై కేసు నమోదు చేసి శవపరీక్ష నిర్వహించి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహంను బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పదిపరీక్షల విధానంలో మార్పులు!

### విద్యాశాఖ ఉత్తర్వులు



కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త
పదోతరగతి పరీక్షల విధానంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక మార్పులు తీసుకొస్తోంది. ఇకపై పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని 2022-23 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని పేర్కొంటూ రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పదో తరగతి పరీక్షల్లో 11 పేపర్లు ఉండగా, కొవిడ్ కారణంగా ఏడు పేపర్లకు ప్రభుత్వం కుదించింది. సీబీఎస్‌సీ సిలబస్‌కు అనుగుణంగా ఆరు సబ్జెక్టులకు ఆరు పేపర్లు మాత్రమే ఉండేలా, ఫిజికల్ సైన్స్, బయాలజీ కలిపి ఒకే పేపరుగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకే కొత్త విధానాన్ని తీసుకొచ్చినట్లు విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏడాది పొడవునా వివిధ పరీక్షలు నిర్వహిస్తుండటంతో 11 పరీక్షలు అవసరం లేదని ప్రభుత్వం భావించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# రాహుకేతు పూజా మండపాల్లో ఇఓ తనిఖీలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారంతంతో రద్దీ పెరుగుతుంది. ముఖ్యంగా సోమవారం ఉదయం రాహుకాల సమయంలో మంగళవారం మధ్యాహ్నం రాహుకాల సమయంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిలువుదోపిడి అనే నినాదం ప్రముఖంగా మారింది. దాంతో ఆలయల ఇఓ వికె సాగర్‌బాబు నిత్య పరిశీలనలు, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. సోమవారం ఉదయం నుంచి ఆయన రాహుకేతుదోష నివారణ మండపాల్లో తిష్ట వేసారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే ఇక ఇంటికే అని స్పష్టం చేస్తున్నారు. సుమారు నెల రోజులకు పైగా ఆలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకునే భక్తుల నుంచి 'దక్షణ వసూలు' సంప్రదాయానికి స్వస్తి చెప్పారు. దాంతో ఎవరు పిర్యాదు చేసినా ఇఓ స్పందిస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇక్కడ ఉన్న రాజకీయ పరిస్థితితో బయటకు వెళ్ళిన వారు మళ్ళీ సిఫార్సులతో లోపలకు వస్తున్నారు. దాంతో దళారీ వ్యవస్థ రూపుమాపుతటకు బదులు వేళ్ళు నాటుకుంటుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఇఓ వికె సాగర్‌బాబు రాహుకేతు నివారణ పూజా మండపాల్లో తిష్ట వేసి భక్తుల నుంచి వసూళ్ళు కాకుండా గమనిస్తున్నారు. ఇక అడ్డదారి దర్శనాలకు వెళ్ళె వారెవరైనా సరే టిక్కెట్లు కొనుగోలు చేయనిదే కంచుగడపవ వద్ద సిబ్బందికి హెచ్చరిస్తున్నారు.

ఓమోస్తరు భక్తుల తాకిడి:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి పెరుగుతుంది. సోమవారం సాయంత్రం అధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 21వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే రూ.200టిక్కెట్లు కొనుగోలు చేసి 759 మంది ప్రత్యేక దర్శన టిక్కెట్లు రూ.50లవి 1552 మంది ప్రవేశించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు ఽకూడా మూడున్నర వేలు జరిగాయి. రూ.500టిక్కెట్లు ద్వారా 2051, రూ.750లటిక్కెట్టు కొనుగోలు చేసి 932లు రూ.1500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 257 మంది, రూ.2500ల టిక్కెట్లు కొనుగోలు చేసి 183 మంది, రూ.5వేల టక్కెట్లు 49 మంది పూజలు జరిపించుకున్నారు.

## ఉష్ణోగ్రతలు

22/8/2022



- తిరుపతి 35 డిగ్రీలు
- చిత్తూరు 36 డిగ్రీలు
- మదనపల్లి 31 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 36 డిగ్రీలు
- వెంకటగిరి 36 డిగ్రీలు
- గూడూరు 36 డిగ్రీలు

## బంగారం ధరలు

22/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,815

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,253

## కోడిగ్రుడ్ల ధరలు

22/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00

1 డజను: రూ.60.00

# టిక్కెట్ల ఖరారుపై కసరత్తు మొదలు!

### తెలుగుతమ్ముళ్ళలో టెన్షన్...టెన్షన్ !!



ప్రభాతవార్త-తిరుపతి:
పార్టీ అధికారంలో ఉన్నా...లేకున్నా నిత్యం ప్రజల్లో ఉంటూ...వారి ఆదరాభిమానాలు చూరగొన్న నాయకులకే రానున్న అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలకు టిక్కెట్‌లు ఖరారుచేసే కసరత్తును తెలుగుదేశం అధినేత,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదలుపెట్టారు. ఇందుకోసం ఆయా ప్రాంతాల నేతల పనితీరుపై పార్టీ కార్యకర్తల నుంచి అభిప్రాయసేకరణతోబాటు తనదైన శైలిలో సర్వేలు ,నివేదికలు తెప్పించుకునేందుకు సిద్ధమయ్యారు. చంద్రబాబు నలభై ఏళ్ళ రాజకీయజీవితంలో నిర్ణయం తీసుకోని విధంగా ఈ సారి సాధారణ ఎన్నికలకు ఏడాదిన్నర సమయం ముందే పోటీచేసే అభ్యర్థులను ఖరారు చేస్తూ టిక్కెట్లు ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఆ దిశగా చంద్రబాబు వ్యూహ రచన చేస్తూ, అందుకు తగ్గట్లు పార్టీకోసం గత నలభైసంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తూ పదవులు దక్కించుకున్న నేతలేగాక పదవులు లేకుండా పార్టీయే సర్వస్వంగా భావించి నిలబడి ఉన్న నాయకుల అభిప్రాయాలకు గౌరవమిచ్చేలా చూస్తున్నారు. ఇప్పటికే రాయలసీమజిల్లాలకు చెందిన పలువురు నాయకులకు 9నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారుచేస్తూ బాబు తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో సొంత జిల్లా చిత్తూరు. తిరుపతి జిల్లాల్లోనూ టిక్కెట్లు ఆశించిన నాయకులకు ఇప్పుడు చమటలు పడుతున్నాయి. తమలో ఎక్కడ లోపం ఉంది, ప్రజలకు ఏమి చేశామనే అంతర్మథనంలో పడ్డారు. ఈ సారి ఎన్నికల్లో టిక్కెట్ దక్కించుకునే అదృష్టం ఉన్న నాయకులు ఎవరనేది పార్టీలోనే బలమైన చర్చకు అవకాశంగా మారింది. ఇప్పటివరకు రెండు జిల్లాల్లో నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకే ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయించే సంస్కృతి చంద్రబాబు ఆచరిస్తూ వచ్చారు. అయితే ఇప్పటికే పార్టీలో కోవర్టులుగా తయారవడం, పార్టీలో ఆధిపత్యపోరు, నేతలను, కార్యకర్తలను పట్టించుకోకుండా విస్మరించడం వంటివి పలువురు నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలపై ఏకంగా బాబుకే కార్యకర్తలు ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వినూత్నంగా చంద్రబాబు యోచిస్తూ ,ప్రజా బలం కలిగి గెలిచే నాయకులు ఎవరున్నారనేది ఆరాతీస్తున్నారు. గతంలో పార్టీలో పనిచేస్తూ పలు కారణాలతో పార్టీకి దూరంగా వున్న వారిని దగ్గరకు తీసుకోవాలని యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా చిత్తూరుజిల్లాలో ఇప్పటికే ఖరారైన పుంగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డితోబాటు కుప్పం నుంచి మళ్ళీ చంద్రబాబునాయుడు పోటీచేస్తున్నారు. ఇక పలమనేరు నుంచి అమరనాథరెడ్డి, పీలేరులో నల్లారి కిషోరకుమార్‌రెడ్డికి ఖరారుచేశారు. చిత్తూరు నియోజకవర్గంనుంచి పులివర్తినాని, గురజాల సందీప్ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. అయితే సికె బాబు పేరు పార్టీ వర్గాలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పార్టీకి కనీసం సమర్థులైన ఇన్‌ఛార్జిలు కూడా లేని జిడి నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలపై బాబు ప్రత్యేకంగా చొరవతీసుకోనున్నారు. ఇక్కడ పార్టీని ఏకతాటిపై నడిపించే నాయకులు ఎవరనేది అన్వేషిస్తున్నారు. నగరి నియోజకవర్గంలో గాలి భానుప్రకాష్‌తోబాటు అశోక్‌రాజు ,మాజీమంత్రి చెంగారెడ్డి కుమార్తె ఇందిరా ప్రియదర్శిని పేర్లు పార్టీవర్గాల్లో పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. సత్యవేడులో ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న జెడి రాజశేఖర్,హేమలత పోటీపడుతున్నారు. శ్రీకాళహస్తిలో బొజ్జలసుధీర్‌రెడ్డికే అవకాశాలు ఉన్నా పార్టీకి ధీటుగా పనిచేయాలనే సంకేతాలు ఇస్తున్నారు. తిరుపతిలో ఇప్పటికే ఇన్‌ఛార్జిగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కీలకంగా పనిచేస్తున్నప్పటికీ పార్టీలో విబేదాలు లేకుండా అందరినీ కలుపుకుని పనిచేయడంలో విఫలమయ్యారనే పార్టీశ్రేణులు బాబుకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక్కడ జెబి శ్రీనివాస్ పేరు కూడా పరిశీలిస్తున్నారు. చంద్రగిరిలో పులివర్తి నాని, నారారోహిత్ పేర్లు ,అన్నమయ్యజిల్లాలో మదనపల్లి నుంచి దొమ్మలపాటి రమేష్ పేర్లు పరిశీలనలో ఉన్నాయనేది రాష్ట్ర పార్టీ వర్గాల సమాచారం. రేపటినుంచి మూడురోజులు కుప్పం పర్యటనకు విచ్చేస్తున్న చంద్రబాబు రెండు జిల్లాల్లో కొందరు నమ్మకస్థులైన నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

## మంత్రి పెద్దిరెడ్డిని విమర్శిస్తే సహించం : వైకాపా



చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని జనసేన పవన్‌కళ్యాణ్ విమర్శిస్తే సహించేది లేదని హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణ్‌భరత్, ఎంపిపి గాజుల రామ్మూర్తి, సింగిల్‌విండో ఛైర్మన్ రవిచంద్రారెడ్డిలు హెచ్చరించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 2019మే 8న టిటిపి ప్రభుత్వ హయాంలో పుంగనూరు మార్గంలోని పెట్రోల్‌బంక్ ఎదుట ఇన్నోవా వాహనం ద్వారా యాదృచ్ఛికంగా రోడ్డు ప్రమాదం సంభవించి హరీష్ అనే యువకుడు మరణించాడనీ, అప్పట్లో పోలీసుకేసు నమోదై రూ. 13లక్షల వరకు బాధితులకు అందజేశారన్నారు. పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన 17మందిపై పోలీసులే కేసు నమోదు చేశారన్నారు. ఇవేమీ తెలుసుకోకుండా పవన్‌కళ్యాణ్ వైకాపా ప్రభుత్వం, మంత్రి పెద్దిరెడ్డిపై చౌకబారు మాటలనడం సమంజసం కాదన్నారు. నిజానిజాలు తెలుసుకొని మాట్లాడాలనీ, లేకుంటే రాష్ట్రంలో జనసేనకు మనుగడ లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఎంపిటీసీ శ్రీరాములు, సర్పంచు ఓబుల్‌రెడ్డి, వైకాపా నాయకులు పద్మనాభరెడ్డి, శంకర్‌రెడ్డి, శివన్న తదితరులు హాజరయ్యారు.

## మైనారిటీలకు వైకాపా ప్రభుత్వం టోపీ పెట్టింది : మైనార్టీ నాయకులు



పలమనేరు, ఆగస్టు 22, ప్రభాతవార్త:

మైనారిటీలకు వైకాపా ప్రభుత్వం టోపీ పెట్టిందని రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి రఫీ తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం మైనార్టీలకు తీరని అన్యాయం చేసిందని తెలిపారు. మైనార్టీకు ఈ ప్రభుత్వంలో ఏ ఒక్క మేలు జరగలేదని విమర్శించారు. మైనారిటీలపై అనేక దాడులు జరుగుతున్నాయని ఇటీవల ఇద్దరు మైనారిటీ మహిళలపై దాడి జరిగితే ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో పెరిగిన స్వల్ప ధరలు ముఖ్యమంత్రి టిడిపి ప్రభుత్వంలో బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేశారు. ప్రస్తుతం ఆయన ప్రభుత్వంలో 100శాతం ధరలు పెరిగినప్పటికి ఆ విషయం ఆయనకు తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి జహంగీర్, జిల్లా అధ్యక్షులు ఖాజాపీర్, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు చాంద్ బాషా, జిల్లా మైనారిటీ అధికార ప్రతినిధి ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

## మూడేళ్లలో మూడు పరిశ్రమలైనా తెచ్చారా - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త

రాష్ట్రంలో మూడేళ్ల వైకాపా పాలనలో మూడు పరిశ్రమలు కూడా తేలేదని సిఎం జగన్‌రెడ్డి ఏం సాధించారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ప్రకటనలో విమర్శించారు. తెదేపా పాలనలో 98పెద్ద పరిశ్రమలు 39350 కోట్ల పెట్టుబడితో స్థాపించి 60541మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. 31671చిన్న పరిశ్రమలను 8285కోట్లతో ప్రారంభించారన్నారు. చంద్రబాబు తెచ్చిన పరిశ్రమలను తాను తెచ్చినట్లు సిఎం ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నాడు విష ప్రచారం చేసి నేడు అదే భూముల్లో శంకుస్థాపనలు చేస్తున్నారని, సిఎం దావోస్ పర్యటనతో రాష్ట్రానికి ఒరిగింది శూన్యమన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ఒక్క రూపాయి రాయితీ కూడా ఇవ్వలేదన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని పేర్కొన్నారు.

## మైనార్టీలను మోగిస్తున్న వైకాపా ప్రభుత్వం - తెదేపా మైనార్టీ అధ్యక్షుడు జాకీర్

కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త

వైకాపా ప్రభుత్వంఅధికారంలో వచ్చాక రాష్ట్రంలోని మైనార్టీలకు తీరని అన్యాయం చేస్తోందని కుప్పం నియోజకవర్గ టిడిపి మైనార్టీ అధ్యక్షుడు జాకీర్ పేర్కొన్నారు. సోమవారం కుప్పంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న దుల్హన్ పథకానికి చెక్ పెట్టారని అలాగే రంజాన్ తోఫా, విదేశీ విద్యకు మంగళం పాడారన్నారు. వైకాపా ప్రభుత్వం ఏ ఒక్క పథకాన్ని మైనార్టీలకు అమలు చేయడం లేదన్నారు. తెదేపా హయాంలోనే మైనార్టీల సంక్షేమంకు పెద్దపీట వేశారన్నారు. నిధుల సాకుతో దుల్హన్ పథకంకు అటకెక్కించారని కోర్టులో స్పష్టమైందన్నారు. సమావేశంలో రాష్ట్ర విభాగం కార్యదర్శి రఫీక్, నేతలు జహంగీర్, ఉమ్మర్ షేక్, ఖాజాపీర్, సర్దార్ బాషా, గని, నబీ, అజీమ్, జమీల్, మునాఫ్, బాబు పాల్గొన్నారు.

## రూ.2 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

సదుం, ఆగస్టు 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని చెరకువారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నాడు నేడు రెండవ విడత కింద రూ.80లక్షలు మంజూరైనాయని ఎంపిపి ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు తెలిపారు. సోమవారం ఆపాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు గాను శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ పాఠశాలల అభివృద్ధికి నాడునేడు కింద నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తున్నాడన్నారు. పాలమందలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.92లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సాయంత్రం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచిలు ఐశ్వర్య, అనితకుమారి, ఉపసర్పంచి బొమ్మల్‌రెడ్డి, సర్వశిక్షాఅభియాన్ అధికారి అజయ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ శ్రీరాములు, ప్రధానోపా ధ్యాయులు సందీప్‌రెడ్డి, శ్రీనివాసులు, వాటర్‌షెడ్ ఛైర్మెన్ వెంకట రమణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, విద్యాకమిటీ అధ్యక్షుడు రెడ్డెప్ప, వైకాపా నాయకులు భాస్కర రెడ్డి, పాపిరెడ్డి, రవికుమార్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సదుం ఇన్‌చార్జి ఎంపీడీఓగా వరప్రసాద్

సదుం, ఆగస్టు 22 ప్రభాతవార్త

సదుం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పని చేస్తున్న ఆదిశేషారెడ్డి ఇటీవల పదోన్నతి పొంది డిప్యూటీ సీఈఓగా చిత్తూరుకు బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఇన్‌చార్జి) ఇక్కడ పని చేస్తున్న ఈఓఆర్‌డీ వరప్రసాద్‌ను నియమించారు. ఈమేరకు అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ధనంజయరెడ్డి, అమరావతి, ఎంపీటీసీలు, సర్పంచిలు ఆయనను అభినందించారు.

## ఘనంగా ముగిసిన బాలాలయ సంప్రోక్షణ



కల్లూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త

పులిచెర్ల మండలం మంగళంపేటలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గత మూడు రోజులుగా జరుగుతున్న బాలాలయ సంప్రోక్షణ కార్యక్రమం సోమవారం నాటికి ఘనంగా ముగిసింది. ఇక్కడ ఉన్న పురాతన వెంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు వెళ్లి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించగా ఆయన తితిదేకు లేఖ రాశారు. దీనితో తితిదే అధికారులు వచ్చి పరిశీలించి ఇటీవల రూ.1.98కోట్లు మంజూరు చేశారు. ఈనేపథ్యంలో తితిదే ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఆలయం పునర్మిణానికి గాను బాలాలయ సంప్రోక్షణ, హోమాలు చేశారు. కార్యక్రమంలో తితిదే ఆగమసలహాదారు సాపిమనిబట్టార్, సువర్ణకుమార్, ఆలయ అర్చకులు శేషాద్రి, ఈఈ శివరామకృష్ణ, డిఈ సర్వేషన్, ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, శ్రీనివాసులు, హేమంత, కుంచె లక్ష్మీపతి, మధు, నాగరాజ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతన్న సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత

చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త



వైకాపా ప్రభుత్వంలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాముఖ్యత ఇస్తున్నట్లు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. మండలంలోని పరికిదొన పంచాయతీ మల్లెలవారిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లో-ఓల్టేజీ సమస్య పరిష్కారానికి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తూ రైతుల అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చుతున్నామన్నారు. అనంతరం ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు, జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు నరసింహులుయాదవ్, హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణభరత్, ఎంపిటీసీ శ్రీరాములు, సర్పంచులు లక్ష్మీదేవిబాబు, భాగ్యవతిహరిబాబు, గడ్డంవారిపల్లి, పరికిదొన పంచాయతీల వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ పాలకమండలి సమావేశం వాయిదా

కాణిపాకం, ఆగస్టు 22 ప్రభాతవార్త:

కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి సమావేశం వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ ఎంవి.సురేష్‌బాబు తెలిపారు ఛైర్మన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సమావేశం అనివార్య కారణాల వాయిదా వేసినట్లు తెలిపారు. ఈవిషయాన్ని పాలకమండలి సభ్యులు గమనించాలని ఆయన కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పన్ను వసూళ్లపై మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సోమవారం పలువురు వాహనాల యజమానులు, తెదేపా నేతలు ధర్నా చేపట్టారు. స్థానికంగా సొంత వాహనాలు కలిగిన యజమానులకు కూడా మున్సిపాలిటీ ద్వారా పన్ను వసూలు చేయడం తగదన్నారు. తమకు రోజుకు రెండువందల ఆదాయం కూడా రావడం లేదని ఇలాంటి సమయంలో కొత్తగా పన్నులను వసూలు చేయడం సబబు కాదన్నారు. కాగా ధర్నా విషయం తెలుసుకున్న అర్బన్ సిఐ శ్రీధర్ సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. కనీస సమాచారం ఇవ్వక ధర్నాలు చేయడం మంచిది కాదని మూడు రోజుల్లోపు సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వాహన యజమానులు, తెదేపా నేతలు ధర్నా విరమించారు. అనంతరం కమీషనర్ రవిరెడ్డికి సైతం యజమానులు వినతిపత్రం అందించారు.

## తెదేపా నేత ఆర్ముగంచే భారీ ఎత్తున అన్నదానం

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ తెదేపా ప్రధాన కార్యదర్శి ఆర్ముగం అధ్వర్యంలో సోమవారం కుప్పంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్న క్యాంటీన్ ద్వారా ఆయన సుమారు ఐదువందలమందికి అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అన్నదానం చేయాలనుకుంటే స్థానిక తెదేపా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, వసంతమ్మ, మంజు, రాజా తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో ప్రత్యేక పూజలు



కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త

కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత మూడు నెలలుగా పార్టీ కార్యాలయంను అన్ని ఆధునాతన వసతులు, గదులతో నూతనంగా నిర్మించారు. ఈనెల 25న అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ కార్యాలయాలను స్వయంగా ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో సోమవారం కార్యాలయంలో పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, కార్యాలయ మేనేజర్ కాళప్ప నాయుడు, నేతలు డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, ఆర్ముగం, త్రిలోక్, బిఎంకె రవిచంద్ర, బుజ్జి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్సీ



గుడుపల్లె, ఆగస్టు 22 ప్రభాతవార్త

పేదల సంక్షేమమే సిఎం జగనన్న ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం కనమనపల్లిలో ఎమ్మెల్సీ గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. 2024లో మరలా సిఎంగా జగనన్న ఎన్నికవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, జడ్పీటిసి శ్రీనివాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి వెండి సామాగ్రి వితరణ

చౌడపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త

రాజనాబండ ఆంజనేయస్వామి ఆలయానికి దాతలు వెండి సామాగ్రిని విరాళంగా అందించారు. కరణంవారిపల్లికి చెందిన కరణం మంజునాథ్, కరణం రాజేంద్ర కుటుంబ సభ్యులు నిత్యం స్వామివారికి ఉపయోగపడే వెండి ఉద్దరిణి, తీర్థపుపాత్రలను ఆలయ నిర్వాహకులకందించారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, బాలాయపల్లి దొరవారిసత్రం,

## కరిపేటి కాలువ కాలుష్యాన్ని నివారించండి

### - ఆర్డీవోకు రైతుల విజ్ఞప్తి



తడ, ఆగస్టు 22 ప్రభాతవార్త

తడ, వరదయ్యపాలెం మండలాల పరిధిలో పంట పొలాలకు ప్రధాన నీటి వనరు అయిన కరిపేటి కాలువ కాలుష్యాన్ని అరికట్టాలని తడ మండల రైతులు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఆర్డీవో రోజ్‌మాండ్‌కు సీపీఐ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేసిన వినతిపత్రంలో రెండు మండలాల పరిధిలోని బత్తుల వల్లం, రాచకండ్రిగ, విశలాయపాలెం, చేనిగుంట, అండగుండల, గ్రద్దగుంట, అనపగుంట, తడకండ్రిగ, బోడిలింగాలపాడు రైతులు ఇటీవల ఆ కాలువలో చేరే కాలుష్యం వల్ల నష్టపోతున్నట్లు చెప్పారు. వ్యవసాయానికి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్ల మళ్లించుకోవడంతో పాటు మూగజీవాలకు ఈ నీరు ఆధారంగా ఉందని చెప్పారు. అయితే ఎగువ ప్రాంతంలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలలోని మురుగునీరు తూముల ద్వారా ఈ కాలువలో వదిలేయడంతో నీళ్లు కలుషితంగా మారిపోయాయని చెప్పారు. ఈ సమస్యను గతంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేస్తే ఇది రెండు జిల్లాల పరిధిలోకి వస్తుందని అధికారులు దాటవేశారని, ఇప్పుడు రెండు మండలాలు కూడా తిరుపతి జిల్లాలో చేరినందున అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## కుదిరిలో బాదుడే బాదుడు

సూళ్లూరుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మండల పరిధిలోని కుదిరి గ్రామంలో సోమవారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పటికే అప్పుల ఊబిలోకి వెళ్లిపోయిందని, దీన్ని పట్టించుకోకుండా అర్థంలేని ప్రకటనలు జారీ చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఇప్పటికే ఆర్థిక నిపుణులు హెచ్చరించి ఉన్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షులు కొక్కు శంకరయ్య యాదవ్, కార్యదర్శి పాకం వెంకటసుబ్బయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మ దేవస్థానంలో మహాకుంభాభిషేకం

గూడూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త



గూడూరు పట్టణానికి సమీపంలోని నెల్లటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీమాతమ్మ అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. వేదపండితులు కృష్ణమూర్తి బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పీఠపూజ, గర్తన్యాసము, యంత్రస్థాపన, శేష హోమములు, మహాపూర్ణాహుతి, కుంబాభిషేకం నిర్వహించడం జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి శిలాప్రతిష్టకు నవగ్రహ ధాన్యములు, నవరత్నాలు తీసుకువచ్చి పీఠం క్రింద వేశారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. మాతమ్మ పోతురాజు, శిఖరం, మాతమ్మ అమ్మవారి పంచలోహ ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని దాతలు దేవస్థానంకు అందజేశారు.

## రసాభాసగా మండల మీట్

### - టీలు, బిస్కెట్లకే పరిమితమవుతున్న సమావేశాలెందుకు



కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త

ప్రతి మూడునెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాల్లో సభ్యుల ప్రశ్నలకు అధికారులు సమస్యలు పరిష్కరించలేనప్పుడు ఎందుకని కోట ఎంపీటీసీ బిట్-1 సభ్యులు దారా సురేష్ ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అంజమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు సురేష్ మాట్లాడుతూ గొంతు చించుకొని మాట్లాడుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. టీ, బిస్కెట్ల కోసమేనా ఈ సమావేశాలు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కోట పట్టణంలో తిరిగే చెత్త బండి దళితవాడల్లోకి రాదని ఆరోపించారు. దళితులు, గిరిజనులు అంటే చులకనగా ఉందా అంటూ ప్రశ్నించారు. హైటెన్షన్ తీగలు కింద వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అనంతరం మరో ఎంపీటీసీ సభ్యులు మొబిన్‌బాషా మాట్లాడుతూ జగనన్న ఇళ్ల పట్టాల కోసం 175 మంది లబ్దిదారులు రెండేళ్లుగా ఎదురు చూస్తున్నారని, త్వరగా లేఅవుట్లు వేసి పూర్తి చేయాలని కోరారు. ఇందుకు తహాశీల్దార్ పద్మావతి సమాధానమిస్తూ లేఅవుట్లు లెవలింగ్ పూర్తయిన వెంటనే అందరికీ పట్టాలిస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జెండా ఆవిష్కరణకు రాని అధికారులకు మెమోలు ఇవ్వాలని మరో ఎంపీటీసీ సభ్యులు షంషుద్దీన్ అడిగారు. ఇందుకు ఎంపీడీవో భవాని సూపరింటెండెంట్‌ను పిలిచి నోటీసులు సిద్ధం చేయాలని ఆదేశించారు. హుందాగా జరగాల్సిన సభ ఇలా క్రమశిక్షణ లేకుండా జరగడం మంచిది కాదని కొత్తపట్నం ఉప సర్పంచ్ ప్రసాద్‌గౌడ్ విమర్శించారు. తీరప్రాంత గ్రామాల విద్యార్థులు బస్సులు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చే సోమవారంలోగా బస్సును నడపకపోతే వాకాడు డిపోను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారులతో సభ్యులు వాగ్వివాదానికి దిగడంతో సమావేశం రచ్చరచ్చగా మారింది. అధికారులు నివేదికలు చదువుతుండగానే ప్రజాప్రతినిధులు సభ వైపు దూసుకొచ్చి అధికారులతో వాగ్వివాదానికి దిగడం కనిపించింది. ఈ సమావేశంలో ఎంపీడీవో భవాని, తహశీల్దార్ పద్మావతి, ఎంపీపీ దాసరి అంజమ్మ, ఉపాధ్యక్షులు సౌజన్యరెడ్డి, ఉప్పల శేషయ్య, జడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు ప్రభుత్వం.. విధి విధానాలొచ్చాయ్

కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు చేపట్టడానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. గ్రామ సచివాలయాల పరిధిలో రూ.20 లక్షలు నిధులు ఖర్చు చేయడానికి ఈ నెల 2న ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం పక్షం రోజులు తర్వాత వీటి వినియోగానికి మార్గదర్శకాలు జారీ చేసింది. గడప గడపకు కార్యక్రమం పూర్తయినా సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేయాలని పేర్కొంది. ఈ నిధులను ఏ పనులకు వినియోగించాలో ఉత్తర్వులు జారీ చేసింది. ఒక పనికి కనిష్టంగా లక్ష రూపాయలు, గరిష్టంగా 20 లక్షల రూపాయలు చొప్పున వెచ్చించేలా విధి విధానాలను రూపకల్పన చేసింది. వారానికి రెండు సచివాలయాలు, నెలకు ఆరు సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు పూర్తి చేసి గుర్తించిన పనులను సచివాలయ శాఖ పోర్టల్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. అక్కడ అనుమతి పొందిన తర్వాత ఎంపీడీవోలు, డీపీఆర్ వివరాలను మళ్లీ పొందుపరిచే విధంగా మార్గదర్శకాలు ఇచ్చారు. వీటికి మళ్లీ అనుమతి ఇచ్చాక కలెక్టర్ ద్వారా పనులకు ఆమోదం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. డిసెంబరు నెలాఖరు నాటికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని పేర్కొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచండి ....ఎంపిడిఓ

నాయుడుపేట రూరల్ ఆగస్టు 22 ప్రభాతవార్త ;

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని నాయుడుపేట ఎంపిడిఓ శివప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ శివప్రసాద్ మాట్లడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండ పారిశుద్ధ్యం మెరుగుపరిచే విధంగా పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించి వర్షాకాలంలో వచ్చే వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని వీదుల్లో మురికినీరు, పేడదిబ్బలు నిల్వచేయకుండా తొలగించాలని సూచించారు. ప్రజలకు అందుభాటులో ఉండి వారిసమస్యలు తెలుసుకొని పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. ఈసమావేశంలో పంచాయితీ కార్యధర్శిలు గోపాల్, గాబ్రేయిల్, మాదవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్, వైద్యసిబ్బంది, తదితరులు ఉన్నారు.

## విద్యాబోధనకు ఆటంకంగా మారిన 'ఫేస్ రికగ్నిషన్' యాప్

### - డిఇఓకు వినతి చేసిన తెలుగునాడు విద్యార్థి సమాఖ్య



చిత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:

విద్యాబోధనకు ఆటంకంగా మారిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా విద్యా శాఖాధికారికి సోమవారం వినతి చేసారు. చిత్తూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రభుతేజ మాట్లాడుతూ చాలామంది టీచర్లకు స్మార్ట్ ఫోన్లు లేవనీ, వున్న దాని గురించి సరైన అవగాహన లేక తీవ్ర అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వమే ఉపాధ్యాయులకు ట్యాబ్ లేదా మొబైల్‌ఫోన్ పరికరాలు సరఫరాచేయాలనీ, 9గంటలకు ఒక నిమిషం ఆలస్యమైనా సెలవు పెట్టాలనీ నిర్ణయించడం దారుణమన్నారు. హడావిడిగా ముఖచిత్ర అప్లికేషన్ ప్రవేశపెట్టడం టీచర్స్‌కు పెనుభారం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్‌నాయుడు, రామక్రిష్ణ, రాజ్‌కుమార్, ప్రకాష్, గిరీష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పథకాలన్నీ రద్దు చేసి ఎన్నికలకు వెళ్తారా?

## షేక్. గయాజుద్దీన్

కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త

ప్రజా సంక్షేమంపై ప్రధాని నరేంద్ర మోదీ విధానమేమిటో దేశ ప్రజలకు స్పష్టం చేసి చర్చ పెట్టాలని జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి, షెక్.గయాద్దీన్ అన్నారు. ఆయన విద్యానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. భాజపా పాలిత రాష్ట్రాలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ రద్దు చెస్తారో లేదో ప్రధాని చెప్పాలన్నారు. పేదలకు ,రైతులకు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలపై భాజపా వైఖరి స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉచిత సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తామని ప్రకటించి ఎన్నికలకు వెళ్తారా అని ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పథకాలన్నీ రద్దు చేయడానికి పార్లమెంట్‌లో చట్టం ,రాజ్యాంగ సవరణ చేస్తారా అనే విషయాన్ని దేశ ప్రజలకు తెలపాలన్నారు. తన దృష్టిలో ఏది ఉచితమో ! ఏది అనుచితమో ప్రధాని దేశ ప్రజలకు వెల్లడిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. పేదల సంక్షేమ పథకాలపై ప్రధాని నరేంద్ర మోదీకి అక్కసు ఎందుకని ఆయన ప్రశ్నించారు. పేదలకు ఇస్తే ఉచితాలు.. పెద్దలకు ప్రోత్సాహకాలా ? అన్న ఆయన కాకులను కొట్టి గద్దలకు వేయడమే మోదీ విధానమో? అని నిలదీశారు. రైతులకు రుణమాఫీ చేదు.. కార్పొరేట్ రుణ మాఫీ ముద్దా? అని అన్నారు. ఒవైపు విత్యావసరాల మీద జీఎస్టీ భాదుతూ కార్పొరేట్లకు పన్ను రాయితీలు ఇవ్వడమేంటిని ఆయన ప్రశ్నించారు.

## నేడు ఎంఎల్‌సీ అభ్యర్థి రాక

చిట్టమూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త

నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మంగళవారం చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయానికి వస్తారని చిట్టమూరు మండల కోఆప్షన్ సభ్యులు మస్తాన్‌భాయ్, వైసీపీ యువనాయకులు గిరినాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మనోహర్‌గౌడ్, పరిపాలన అధికారి శ్రీనివాసులును కలిసి మండల పరిషత్ సిబ్బంది అందరూ కార్యాలయానికి వచ్చేలా చొరవ తీసుకోవాలని తెలియజేశారు.

## పాస్టర్ల గౌరవవేతనం విడుదల పట్ల హర్షం



చిత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆలయ పూజార్లు, ఇమాంలు, పాస్టర్లకు గౌరవ వేతనం విడుదల చేయడం పట్ల చిత్తూరు కార్పొరేషన్ చర్చి పాస్టర్స్‌యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ విజయవాడలో గురువారం రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజద్‌భాషా అర్హులైన పాస్టర్లకు గౌరవవేతనం ప్రారంభించి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు పాస్టర్లు తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ థ్యాంక్యుసిఎం అని చెబుతూ ఆనందాన్ని వ్యక్తపరిచారు. అలాగే జిల్లా కలెక్టరు, చిత్తూరు ఎమ్మెల్యే, ఈ కార్యక్రమంలో సిసిసిపియు అధ్యక్షులు రబీకుమార్, పాస్టర్ రవి, బెంజిమేన్, సి.కుమార్, లాజరస్, బాలు, ఇ.రమేష్, ప్రసాద్ తదితరులు వున్నారు.

# తిరుపతి డివిజన్

## 'జిపిఎస్' మా దృష్టిలో..'గారడీ పెన్షన్ సిస్టమ్'..!

**-ఏపిఎస్‌సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 22 ప్రభాతవార్త: కాంట్రిబ్యూటరీ పెన్షన్ సిస్టమ్ (సిపిఎస్) రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ సిస్టమ్(ఓపిఎస్)ను ప్రవేశపెట్టా లని గత కొన్నేళ్లుగా ఉద్యోగులు పోరాటం చేస్తు ంటే.. ప్రభుత్వం అదేమీ పట్టించుకోకుండా 'జిపి ఎస్' అనే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. ప్రభు త్వం దృష్టిలో జిపిఎస్ అంటే గ్యారంటీ పెన్షన్ సిస్టమ్ కావచ్చు కానీ..తమ దృష్టిలో మాత్రం అది 'గారడీ పెన్షన్ సిస్టమ్' అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు చీర్ల కిరణ్ అభివర్ణించారు.సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధ రించాలనే ఏకైక డిమాండ్‌తో సెప్టెంబర్ 1న తలపెట్టిన చలో విజయవాడ కార్యాక్రమానికి సంబంధి చిన గోడ పత్రికను అసోసియేషన్ నాయకులతో కలిసి కిరణ్ ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే ఒక్క వారంరోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు.ఆ మాటలు నమ్మి లక్షలాది మంది ఉద్యోగులు ఆయన వెంట నడిచాము.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు కావస్తున్నా ఆ మాటను నిలబెట్టుకోనందున ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. సిపిఎస్‌ను రద్దు చేసిన ఘనత దేశంలో మొట్టమొదటగా మన రాష్ట్రానికే దక్కుతుందని ఆశపడ్డాము కానీ అది నెరవేరలేదు. సెప్టెంబర్ 1న తాముచేపడుతున్న చలో విజయవాడ కార్యక్రమా నికి లక్షలాది మంది ఉద్యోగులు తరలి రాబోతున్నారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు వంకీపురం పవన్,జల్లా శివప్రసాద్, ధరణీ కుమార్, వెంకటేష్, ఆనంద్,కూరపాటి వెంకటేష్, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## డిపిటిఓ చెంగల్‌రెడ్డికి కలెక్టర్‌చే ప్రశంసాపత్రం!

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 22 ప్రభాతవార్త: 76వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకోవడం జరిగిందని ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.డిపిటిఓ/ ఆర్‌ఎం హోదాలో తన విధినిర్వహణలో చేసిన అత్యుత్తమ సేవలను గుర్తించి కలెక్టర్ తనకు ప్రశంసాపత్రం అందచేశారని డిపిటిఓ చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు.

## 24న వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పరిసరాల్లో వెలసిన గొలగ మూడి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు ఈ నెల 24న భారీఎత్తున నిర్వహించుటకుభక్తులు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణానికి సమీపంలో కైలాసగిరుల్లో వెలసిన వెంకయ్యస్వామి ఆలయ ఆరాధనోత్సవాలు బుధవారం ఉదయం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పిజె చంద్రయ్యశెట్టి సోమవారం తెలిపారు. ఉదయం 9గంటలకు షోడషాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. తరువాత అన్న వితరణ, అలాగే సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించబడు తుందని వివరించారు. శ్రీకాళహస్తికి దక్షిణాన వేడాం సమీపంలో వెలసిన భగవాన్ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు గ్రామస్థుల భాగస్వామ్యంతో భారీ ఎత్తున నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయి.,ఇక్కడ వెంకయ్యస్వామి ఆలయ నిర్మాణానికి గత కొంత కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఉదయం హోమాలు నిర్వహించబడుతుందన్నారు. అలాగే మధ్యాహ్నం చుట్టుపక్కల గ్రామాల వారికి సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు జరిగినట్లు సమాచారం సాయంత్రం గ్రామోత్సవంరాత్రి పల్లకి సేవ నిర్వహించుటకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. అలాగే ఊంజల్‌సేవను కూడా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వివరించారు.

## అసలే ఇరుకురోడ్లు..ముందుకు వస్తే ఎలా



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో పురాతన కాలం నాటి వీధులు,రోడ్లు. జనాభా పెరిగింది కానీ రోడ్ల వెడల్పు పెరగలేదు కదా మరి వ్యాపారులు ముందుకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటుంటే జనం ఇబ్బంది ఎవరు గుర్తించాలి? అని సోమవారం అధికారులు ప్రశ్నించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ క మిషనర్ బి.బాలాజి నాయక్, సిఐ అంజూయాదవ్ వారి సహచరులతో కలసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జయరామారావువీధిలో తరచూ ట్రాఫిక్ స్థంభిస్తుంది. ఇక్కడ కేవలం 21 అడుగుల రోడ్డుఉంది. అయితే ఇటు అటు వ్యాపారులు పోటీలు పడి మురుగునీటి కాలువల మీద కూడా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దాంతో పెరిగిన ట్రాఫిక్ వాహనాలతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా నాలుగు మాడావీధుల్లో కూడా పరిస్థితి అలాగే ఉంది. దాంతోజయరామారావు వీధిలోని వ్యాపారులను అధికారులు ఓ వారం రోజుల గడువు ఇచ్చారు. స్వచ్ఛందంగా ఎవరికి వారు ఆక్రమణలు ఎంత వరకు ఉన్నాయో తొలగించుకొని సహకరించాలని లేదంటే జెసిబిలు పెడితే ఏం మిగులుతుందో తెలియని స్థితి అని చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ముఖ్యంగా కూరగాయలు, పండ్ల దుకాణం దారులు, ఫ్యాన్సీ షాపుల వారు మురుగునీటి కాలువలు, విద్యుత్ స్థంభాలను దాటి రోడ్డు మీదకు విస్తరించుకుంటున్నారని అధికారులు గుర్తించారు.

## సర్వేయర్‌కు డిఐగా పదోన్నతి

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త : తొట్టంబేడు సర్వేయర్‌గా పనిచేసిన రవిశేఖర్ డిప్యూటీ ఇన్‌స్పెకర్‌గా పదోన్నతిని పొందారు. ఈమేరకు తొట్టంబేడు మండలం నుంచి సోమవారం రిలీవ్ అయి సూళ్ళూరుపేట డిఐగా బాధ్యతలు స్వీకరించారు. రవిశేఖర్ గతంలో శ్రీకాళహస్తి, తిరుపతి, తొట్టంబేడు, వరదయ్యపాళెం మండలాల్లో సర్వేయర్‌గా పనిచేసిన ఆయన తిరిగి తొట్టంబేడు మండలంలో పనిచేశారు. ఇక్కడ పనిచేస్తూ పదోన్నతిని పొందారు. ఈసందర్భంగా ఆయన్ను తహశీల్దార్ సుధీర్‌రెడ్డితో పాటు పలువురు అభినందించారు.

## శతకపద్యాల పోటీల విజేతలకు బహుమతులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : పట్టణంలోని నాగమల్లికృష్ణమూర్తి పౌండేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేమన పద్యాలు మరియు సుమతి శతక పద్యాల పఠన పోటీ విజేతలకు సోమవారం ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి ప్రథమ బహుమతిని కె.విష్ణువర్ధన్, ద్వితీయబహుమతిని షేక్.అఫ్సర్‌హాన్, తృతీయ బహుమతిని కె.యమున, ప్రత్యేక బహుమతులను లోకేశ్వరి, ఆదిత్య ప్రసాద్‌లు అందుకున్నారు. వీరికి న్యాయవాది చలమయ్య, మరియు చిత్రకారులు కె.దామోదరాచారి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విశ్రాంత తెలుగు పండితులు రాఘవులు, పుల్లూరురామకృష్ణలను దుశ్శాలువతో సత్కరించారు. దినేష్, రవికుమార్, మల్లికార్జున్, సుందరాచారి, రామయ్య, పద్మజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బీడికాలనీలో ఆక్రమణలు..!

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త : బీడికాలనీలో ఆక్రమణలకు అడ్డుకట్టలేకుండా పోతోంది. ఈనేపథ్యంలో బీడికాలనీని జగనన్న కాలనీగా మోడల్ కాలనీగా నిర్మిస్తున్నారు. ఇక్కడ కాలనీలో సుమారు 580మందికి పైగా జగన్న ఇంటిస్థలాలు ఇచ్చారు.దీంతో ఇక్కడ ఓమోడల్‌కాలనీగా ఏర్పడ ంది. అయితే కొందరు అక్రమార్కులు బినామీపట్టాలు చేతపట్టుకుని ఖాళీగా ఉన్న స్థలాలను కబ్జాచేసేం దుకు ప్రయత్నిస్తున్నారు. ఒకప్పుడు బీడికాలనీలో ఎవ్వరునివాసం ఉండేవారు కాదు. అలాంటి బీడ కాలనీని ప్రభుత్వం జగనన్న లేఅవుట్‌గా మార్చి ఇంటినిర్మాణాలను చేపట్టింది. శ్రీకాళహస్తి మండలం కంటే ఇక్కడే నిర్మాణాలు వేగవంతంగా సాగుతున్నాయి. దీనికి సర్పంచ్ సుబ్బయ్య సహకారం చేదోడు వాదోడుగా ఉంది. ఖాళీ స్థలం కనిపిస్తే వేసేయ్ పాగా అన్నట్లు కొందరు అక్రమార్కులు బినామీ పట్టాలు చేతపట్టుకుని అమ్ముకుంటున్నారు. సోమవారం ఇక్కడ కాలనీలో కొందరు ప్లాట్లును కొనుగోలు చేయడానికి రాగా వైకాపా యువనాయకుడు అడ్డుకుని ఇవిపేదలకు చెందినవి ప్రతి ఒక్కరికి పట్టాలు ఉన్నాయని కొన్ని బినామీ పట్టాలు కొందరు సృష్టించి అమ్ముకుంటున్నారని తెలిపారు. ఇక్కడ స్థలాలు కొనుగోలు చేయడానికి వచ్చిన వారు వెనుదిరిగారు. తహశీల్దార్‌కు సమాచారం అందడంతో సంబందిత సిబ్బందిని అక్కడకు పంపి విచారణ చేస్తున్నారు.

## ఘనంగా మెగాస్టార్‌పుట్టినరోజు వేడుకలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు పానగల్‌లో మాజీ కౌన్సిలర్ జయదేవన్‌గిరి సారథ్యంలో మెగా అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. భారీ కేక్‌కట్‌చేసి యువతకు పంపిణీచేశారు. ఈసందర్భంగా జయదేవన్ గిరి మాట్లాడుతూ సినీపరి శ్రమలో ఎంతో స్వయంకృషితో ఎదిగి తనకుంటూ ఓ క్రేజ్‌ను సంపాదించుకున్న మెగాస్టార్ నేడు అందరికీ ఆదర్శనీయంగా మారారన్నారు. ఆయన చిత్రాల్లోనే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా చేస్తున్నారని ఆయన్ను అందరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, జీవరత్నం నాయుడు, మారిమూర్తిరెడ్డి, పోలిగణేష్‌రాయల్, లోకేష్‌రాయల్, మునిశేఖర్‌గౌడ్, మునస్వామిగౌడ్, మణికంఠరెడ్డి, లీలామోహన్‌రెడ్డి, వినోద్, నవీన్, బోస్, ప్రకాష్, మురుగ, సతీష్, విజయాచారి, సోమాచారి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను అందించడమే సిఎం లక్ష్యం

**సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం**

నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త : అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ప్రజలు పట్టం కట్టాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. సోమవాం మండలంలోని కశింమిట్ట, బొబ్బరాజుపాలెం గ్రామాల్లో నాల్గవ విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముందుగా కశింమిట్ట గ్రామంలో నిర్వహించిన గడప గడప కార్యక్రమంలో ప్రజలు ట్రాక్టర్‌తో పూలను పెట్టుకొని ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హులైనా వారికి సంక్షేమ పథకాలు రాకుండా వుంటే వెంటనే వాటిని పరిస్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం బొబ్బరాజుపాలెం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ంలో పాల్గొన్నారు. అక్కడ ప్రజలు పూలవర్షంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. గ్రామంలోని సమస్యను కలిసి కట్టుగా వుండి చేసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రసగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయలు, డిసిసిబి డైరెక్టర్ టి ఊరప్ప, వైస్‌ఎంపిపి శివశంకర్, సర్పంచులు శశికళ అయ్యప్ప, రమేష్, మురుగేశం, గుణశేఖర్, ధర్మలింగం, సుబ్రమణ్యం రెడ్డి, మండల కో ఆప్షన్‌మెంబర్ సోడా మణిరెడ్డి, పిఆర్, అర్‌డబ్ల్యుఎస్ డిఇఇలు మధు సూదన్, ధనంజయులు నాయుడు, ఇంచార్జీ ఎంపిడిఓ గుణశేఖర్, నారాయణవనం ఎఓ శోభారాణి, డాక్టర్లు



హరికృష్ణ, దర్శిత్‌రాజ్, పశువైద్యాధికారి కుమార్, హౌసింగ్ ఎఇఇ కుమార్, ఎఎస్ఐ జయరాం నాయక్, ఎంపిటిసి రవి, వెలుగు ఎపిఎం మమత, ఇరిగేషన్ ఎఇఇ మలర్, ఐసిడిఎస్ సిడిపిఓ కృష్ణవేణి, కార్యదర్శులు బాలాజీ నాయుడు, అనిల్, లీలాకుమారి, బాలాజీనాయుడు, కిషోర్‌రాజు, గీత, సుజన, కిరణ్, శివకుమార్, నాయకులు ఆరుముగం, గోపి, జయరాం, రమేష్, మురుగేశం, హేమచంద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుల ఉన్న చట్టాలను పటిష్ట పరచండి

**- సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికవాడలో ప్రచారం**

కేవీబీ పురం, ఆగస్టు 22 ప్రభాతవార్త: బ్రిటీష్ కాలం నుంచి అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను ఇలాగే కొనసాగించాలని సీఐటీయూ మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత, కార్పొరేట్ కంపెనీలకు ప్రైవేటు ఫ్యాక్టరీల యజమానులకు, లాభాలు చేకూర్చే పని లోబడి, కార్మికులపై అనేక ఆంక్షలు పెట్టి, వారి రక్త, మాంసాలను కరగదీసి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్న ప్రయత్నంలో భాగంగా నేడు లేబర్ యాక్ట్‌కు బదులు లేబర్ కోడ్స్‌గా ప్రభుత్వం పార్లమెంట్‌లోఎలాంటి చర్చ లేకుండా బలవంతంగా ఆమోదింపచేసి నేడు రాష్ట్రాల్లో కూడా ఆమోదింప చేయాలని ఉద్దేశంతో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు దూకుడుగా చర్యలు తీసుకుంటున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు విమర్శించారు. కార్మికులకు ధరలు పెరుగుతున్నంత వేగంగా వేతనాలు పెరగడం లేదని ఇస్తున్న వేతనాలతో అరకొర జీతాలతో కాలం గడుపుతూ విద్య, వైద్యాన్ని లక్షలు పోసి కొనుగోలు చేస్తూ తమ జీవితాలను దుర్భరంగా అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా లేబర్ కోడ్‌లను అమలుపరచి కార్పొరేట్ కంపెనీలకు, ప్రైవేటు యాజమాన్యాలకు మేలు చేసే ఉద్దేశంతో ఉన్న కార్మిక చట్టాలను కూడా రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సందర్భంలో కార్మికులందరూ ఐక్యంగా ఉండి ఉన్న కార్మిక చట్టాలను కాపాడుకోవాలని కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు. కేవీబీ పురం మండలంలోని ఆదిత్య స్పిన్నర్స్ ప్రైవేటు లిమిటెడ్, పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు, దేవరాజ ఆగ్రో ఫుడ్స్ పరిశ్రమలు పని చేస్తున్న కార్మికులకు, కేవీబీ పురం మండలం నుంచి శ్రీసిటీ, సీసీఎల్ కంపెనీ వరదయ్యపాళెం, రేణిగుంట మండలంలోని వివిధ పరిశ్రమలకు వెళుతున్న కార్మికులకు, మఠం, రాగిగుంట, రాజులకండ్రిగ, కేవీబీ పురం, పూడి బ్రాహ్మణపలి, ఆధారం, సూరమాల, గుంటిపేడు, అంజూరు, పేరిం దేశం, తిమ్మసముద్రం, కోవనూరు తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు.

**సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి**



అక్టోబర్‌లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు దాసరి జనార్దన్ పిలుపునిచ్చారు. శని వారం నాడు మండల కేంద్రమైన కేవీబీ పురంలో సీఐటీయూ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న దాసరి జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరిలు మాట్లాడుతూ మండలంలోని అసంఘటిత రంగ కార్మికులందరూ తమ యూనియన్ సభ్యత్వాలు చెల్లించి జిల్లా యూనియన్‌లో నమోదు చేసుకుని మండల మహాసభలు జరుపుకుని, జిల్లా మహాసభలకు హాజరు కావాలని కోరారు. అక్టోబర్ 29,30 తేదీల్లో వరదయ్యపాళెంలో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభల్లో వేలాదిగా అసంఘటితరంగా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మునేశ్వరి, రాజేశ్వరి, మధ్యాహ్న భోజన కార్మికుల పాఠశాల పారిశుధ్య కార్మికులు, ఆశ వర్కర్ మునెమ్మ, సంఘం మిత్రలు, వీఆర్ఏలు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సారూ...కాస్త మట్టన్నా వేయండి

సత్యవేడు, ఆగస్ట్ 22, ప్రభాతవార్త: మండల పరిధిలోని వి.ఆర్. కండ్రిగ వద్ద గత సంవత్సరం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వంతెనకు తూతూ మంత్రంగా చర్యలు చేయడంతో నేడు అది దుస్థితికి చేరుకుని వాహనచోదకులకు యమపాశంగా తయారైందని సమీప గ్రామాల ప్రజలతో పాటు వాహన చోదకులు గగ్గోలు పెడుతున్నారు. నిరుపేదలకు వసతిగృహాన్ని కల్పించాలన్న ఉద్దేశ్యంతో సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా జగన్నకాలనీల నిర్మాణానికి తెరతీశారు. అయితే మండలపరిధిలోని మదనంబేడు గ్రామంలో జగన్నన కాలనీలో ఇప్పటి వరకు పునాదికి నోచుకోకపోవడంతో ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏలా చేరుతున్నాయో ఇట్టే అర్థమౌవు తుంది. ఇకనైనా సంబంధిత శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోతే జగన్నన ఆశయం నీరుగారిపోతుందని ప్రజలు వాపోతున్నారు. అలాగే మదనంజేరి, కాదిరివేడుకు బస్సు సౌకర్యంకు లేకపోవడంతో విద్యార్థులు పుస్తకాలు చేతపట్టి కిలో మీటర్ల మేర నడక ప్రధాన రహదారికి చేరుకుని చదువుకోవాల్సి న పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు ఆర్టీసీ అధికారులతో మాట్లాడి ఉదయం, సాయంత్రం వేళలో నైనా బస్సుప్రయాణం అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**నేడే సర్వసభ్య సమావేశం**

నేడు జరగనున్న సర్వసభ్య సమావేశానికి అధికారులు పాల్గొనాలని మండలపరిషత్ అభివృద్ధి అధికారి అరుణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశానికి పంచాయితీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పంచాయితీ కార్యదర్శులు, అన్నీ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

## చిరంజీవి జన్మదినం సందర్భంగా ఆలయాల్లో పూజలు

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: సినీ హీరో చిరంజీవి 67వ పుట్టిన రోజు సందర్భంగా పుత్తూరులో సోమవారం పలు ఆలయాల్లో పూజలు, అర్చనలు నగరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గోపిరాయల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవి సినీ పరిశ్రమలో ఇంకా ఉన్నత శిఖరాలను పొందాలని నిండు నూరేళ్లు వర్ధిల్లాలి అని చిరునవ్వులతో జీవించాలని మనస్ఫూర్తిగా స్వామిని వేడుకున్నారు. అనంతరం బర్త్‌డే కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయ కుడు రమేష్‌బాబు, అభిమానులు కృష్ణయ్య, మునిరాజా, ఆనంద బాబు, బాలకృష్ణయాదవ్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## నారాయణవనంలో బిఎస్పీ పార్టీ కరపత్రాలు పంపిణీకి స్పందన

నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త : సత్యవేడు నియోజకవర్గ బిఎస్పీ పార్టీ ఇంచార్జీ కె ధనంజయులు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కీళగరం, నారాయణంనం గ్రామాల్లో బిఎస్పీ పార్టీ చెందిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. బిఎస్పీ పార్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన పార్టీ అని ఆ పార్టీ అధినేత మాయావతి బలహీన వర్గాల సంక్షేమ కోసం చేస్తున్న పోరాటాలను తెలియజేశారు. బిఎస్పీ పార్టీ గుర్తు ఏనుగు గుర్తు అని ప్రజలకు పరిచయం చేశారు. త్వరలో ఎపి, తెలంగాణలోను బిఎస్పీ బలోపేతం కావడం ఖాయమన్నారు. ప్రజలు కూడా బిఎస్పీ పార్టీకి మంచి ఆదరణను అందిస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు బిఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని వ్యక్తి మృతి!

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం సమీపంలోని చెన్నై-తిరుపతి జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ వెంకట మోహన్ కథనం మేరకు... జమ్ములమడుగుకు చెందిన ఆనంద్(52) బతుకు తెరువు నిమిత్తం 15 ఏళ్ళ క్రితం తిరుపతిలోని పోస్టల్ కాలనీలో కాపురం ఉంటున్నాడు. తిరుపతి, పరిసర ప్రాంతాల్లో టైప్ రైటింగ్ యంత్రాల మరమ్మతులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పుత్తూరులోని ఓ ఇన్‌స్టిట్యూట్‌లో టైపింగ్ యంత్రాలకు మరమ్మతులు చేసి తిరుపతికి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమద్యంలోని పుత్తూరు మండలం శిరుగురాజుపాళెం సమీపంలోని చెన్నై-తిరుపతి రహదారిపై వెళుతుండగా నారాయణవనం మండలంలోని సిద్ధార్థ కళాశాలలో బీటెక్ చదువుతున్న తిరుపతికి చెందిన విద్యార్థి సతీష్‌కుమార్(21) కళాశాల నుంచి కారులో తిరుపతికి వెళుతూ అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆనంద్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు నేసనూరులో ఆధార్ శిబిరం

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: పుత్తూరు మండలంలోని నేసనూరు గ్రామంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇందిరమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని, 5 నుంచి 15 ఏళ్ళ వయసు పిల్లలకు తప్పని సరిగా అప్‌డేట్ చేయిం చాలన్నారు. బయోమెట్రిక్ అప్‌డేట్, మొబైల్ నంబరు లింక్ ఫోటో మార్పునకు ఎలాంటి డాక్యుమెంట్స్ అవసరం లేదని ఆధార్‌లో పేరు, పుట్టిన తేదీ వివరాలు, అడ్రస్సు మార్పునకు మాత్రమే డాక్యుమెంట్లు అందించాలని తెలిపారు. సచివాలయంలోనే అప్లికేషన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ ప్రజలు తప్పని సరిగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## టీడీపీ నాయకుల మృతికి సంతాపం



వడమాలపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త: మండలంలో ఇద్దరు టీడీపీ నాయకులు మృతి చెందగా నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తన సంతాపాన్ని తెలియజేశారు. ఎనమలపాళెం గ్రామంలో గజేంద్ర బాబు(35) అనారోగ్యంతో మృతి చెందగా, లక్ష్మీపురం గ్రామంలో శ్రీనివాసులునాయుడు (90) మృతి చెందగా భానుప్రకాష్ వారి మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిం చారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలియ జేశారు. నాయకులు ధనంజయులునాయుడు, రాజేష్, వివేకానంద, తిలక్‌రెడ్డి, బంగారయ్య నాయుడు, హేమాద్రినాయుడు, అంజయ్యలు పాల్గొన్నారు.

## కొడాలి నాని నోరు అదుపులో పెట్టుకో!



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : ఎంఎల్ఏ కొడాలినాని నోరు అదుపులో పెట్టుకోవాలని లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వా హక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి) ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీజాతీయ అధ్యక్షులు మరియు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మరియు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎల్‌సి నారాలోకేష్‌లపై నోటికి వచ్చినట్లు అవాకులు, చెవాకులు మాట్లాడడాన్ని ఖండించారు. గౌరవమైన ఎంఎల్ఏ హోదాలో ఉన్న కొడాలినాని ఓబజారురౌడీలా తరచు అదేపనిగా సందర్భం కాకపోయినా మాజీ ముఖ్యమంత్రిని ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదన్నారు. గుడివాడ ప్రజలే నానికి బుద్ధిచెప్పే రోజులు వసానతయన్నారు. ఇలాంటి మంత్రులను, శాసన సభ్యులను మరియు వైకాపా నాయకుల నోటిని అదుపు చేయాల్సిన బాధ్యత ముఖ్య మంత్రిపై ఉందన్నారు. ఇకమీదటైనా హుందాగా ప్రవర్తించకపోతే, నోరు అదుపులో ఉంచుకోకపోతే తెలుగుదేశంపార్టీ ద్వారా తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయం..పవిత్రారెడ్డి



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : సేవా కార్యక్రమాలు ఎంతో అభినంద నీయం అని ఎంఎల్ఏ బియ్యపు మధు సూధన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. పట్టణం లోని హెల్పింగ్‌హ్యాండ్స్ 128వ సేవా కార్యక్రమాలను సంస్థ అధినేత మునీర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతినెలా క్రమం తప్పకుండా ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు అందించడం సంతోషమన్నారు. ఇద్దరు ప్రత్యేక ప్రతిభా వంతులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున నగదును అందించఆరు. సంస్థ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రత్యేక ప్రతిభావంతులకు వారి వైద్య చికిత్స నిమిత్తం ఇద్దరికి నగదు అందించామన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి గోరా, వైకాపా నాయకులు పగడాలరాజు, హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ సభ్యులు గరికపాటి రమేష్‌బాబు, కోళ్ళూరుహరనాథ్‌నాయుడు, డిల్లీబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్‌పై ఛలో విజయవాడ : టిటిడి

తిరుమల,ఆగస్టు 22ప్రభాతవార్తప్రతినిధి: సిపిఎస్ రద్దుకోసం నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమం పోస్టర్లను సోమ వారం టిటిడి,రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్లకిరణ్, సభ్యులు శివప్రసాద్, వంకీపురం పవన్, ధరణీకుమార్, వెంకటేష్, కూరపాటి వెంకటేష్, ప్రసాద్ తదితరులు ఇప్పటి ప్రభుత్వం గత ఎన్నికల హమీల్లో సిపిఎస్‌ను రద్దుచేయకుండా మాటతప్పిందని అన్నారు. ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దుచేసి ఉద్యోగులకు పాత ఫెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని,సెప్టెంబర్ 1న చేపట్టే ఛలో విజయ వాడకు లక్షలాదిమంది ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## కళ్యాణపురంలో 26 బస్తాల రేషన్‌బియ్యం పట్టివేత..!

నారాయణవనం, ఆగస్టు 22 ప్రభాతవార్త : మండలంలోని కళ్యాణపురం పంచాయతీ ఉజ్జినాయుడుకండ్రిగ గ్రామంలో మాజీ రేషన్ డీలర్ భారతి ఇంట్లో 1300 కేజీల(26 బస్తాలు) రేషన్ బియ్యంను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గతంలో రేషన్ డీలర్‌గా భారతి పనిచేసేవారు. ఇటీవల వారి షాపుపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడి చేసి నిల్వలో వచ్చిన తేడా మేరకు షాపును సీజ్ చేశారు. లబ్ధిదారులకు రేషన్ సరుకులను అందించడం కోసం రెవె న్యూ అధికారులు తాత్కలికంగా విఆర్‌ఓ ఉమామహేశ్వరికి ఇంఛార్జ్ ఇచ్చారు. ఆమెతో పాటు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శంకరయ్య ప్రస్తుతం షాపును నిర్వహిస్తున్నారు. అయితే గతంలో రేషన్ డీలర్‌గా పని చేసిన భారతి సుమారు 1300 కేజీల రేషన్ బియ్యంను వారి పాత ఇంట్లో దాచడాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం మేరకు ఎస్ఐ పరమేష్‌నాయక్, సిబ్బందితో వెళ్లి మాజీ డీలర్ భారతి పాత ఇంట్లో పరిశీలించగా26బస్తాలఅక్రమ రేషన్‌బియ్యంను గుర్తించి సీజ్ చేశారు.

## అర్ధనారీశ్వరాలయంలో అన్నదానం



శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న అర్ధనారీశ్వరాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక రైతులు చుట్టు పక్కల ప్రజలు ఈ కార్యక్రమాల్ని నిర్వహించారు. శ్రావణ మాసం ఏకాదశి సోమవారం రావటంతో పవిత్రంగా భావించి ఈ కార్యక్ర మాల్ని ఏర్పాటు చేయటం అభినందనీయం అని ముఖ్యఅతిథిగా హాజరైన అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు.ఈ కార్యక్రమాలను పులిరామచంద్ర పర్యవేక్షణలో ఆయన సహచరులు నిర్వహించారు. చల్లాగోవిందు, సుబ్రమణ్యం, మునికృష్ణారెడ్డి, పిఎం చంద్ర, చల్లా వెంకటేశ్వర్లు,బాచి తదితరులు బాధ్యత వహించారు.ఈ సందర్భంగా వారు చైర్మెన్ అంజూరుతారక శ్రీనివాసులును ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమాల్లో స్వర్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు



తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త : మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో వెలసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఇక్కడ వెంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మ, శ్రీదేవి, భూదేవి పంచలోహవిగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన పలువురు భక్తులు గోవింద మాలలు ధరించి పూజలు చేశారు. ఈవేడుకలకు శ్రీకాళహస్తి మండలం టిఎంవి కండ్రిగకు చెందిన ఏపి బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్‌బాలాజీ ప్రసాద్‌రెడ్డి హజరయ్యారు. ఆయనకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికిదర్శన ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా బాలాజీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేవుని పట్ల భక్తిభావం ఉండాలన్నారు. ఇక ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని దేవుని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి వీరాస్వామిరెడ్డి, రమణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, గరటారెడ్డి, బాలాజీరెడ్డి, వెంకటేశులురెడ్డి,శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మద్యం లేని సమాజం రావాలి

మద్యం విమోచన ప్రచార కమిటి చైర్మన్ లక్ష్మణ్ రెడ్డి




తిరుపతి (విద్య), ఆగస్టు 22, ప్రభాతవార్త : దేశంలో పేదరికానికి, ప్రమాదాలకు మత్తు పానీయాలు, డ్రగ్స్ వంటివి కేంద్ర బిందువు అవుతున్నాయని మద్యం లేని సమాజం రావాలని అందుకు యువత సహకారం తప్పనిసరి అని మద్యం విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం స్థానిక ఎస్వి యూనివర్సిటీ ఆడిటోరియంలో మత్తు పానీయాలు వల్ల జరిగే నష్టాలపై అవగాహనసదస్సును రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ, జిల్లా ఎక్సైజ్ శాఖ సంయుక్తంగా నిర్వహించగా ముఖ్య అతిథులుగా యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ రాజారెడ్డి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ హాజరయ్యారు. మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ పేదవాళ్లు తన సంపాదనలో 70 నుంచి 90 శాతానికి మద్యానికి భానిసలై ఖర్చు చేస్తూ సమాజంలో కుటుంబాలను మరింత పేదరికంగా, బాలకార్మికులుగా, అత్యాచార వ్యక్తులుగా, హత్యలు దోపిడీలకు ప్రధాన కేంద్ర బిందువు అవుతున్నారని అన్నారు. మద్యానికి భానిసలుగా ప్రపంచంలో 8 శాతం ప్రజలుంటే ఏపీలో 11 శాతంగా ఉందని అన్నారు. రాష్ట్రప్రభుత్వం అనేక రకాల చర్యలు చేపట్టి దశలవారీగా మద్య నియంత్రణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అలాగే రాష్ట్ర మద్య విమోచన ప్రచార కమిటీ ఏర్పాటుతో ప్రజల్లో అవగాహన తీసుకురావడానికి ఏర్పాటు చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 100 కళాశాలల విద్యార్థులతో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో నేడు ప్రతి జిల్లాలో మద్యానికి, డ్రగ్స్‌కు బానిస అయిన వారికి డి -అడిక్షన్ సెంటర్ 15 ఏర్పాటు చేసారని అన్నారు. ప్రతి టోల్‌ప్లాజ వద్ద బ్రీత్ అనలైజర్లు ఏర్పాటు మంచిదని అన్నారు. కొన్ని సదస్సులలో విద్యార్థులు తన తండ్రి అంటే ప్రాణం అని త్రాగి ఇంటికి వస్తే భయం వేస్తుందని చెప్పిన సందర్భాలు కూడా వున్నాయని, అవి విని మనకు బాదకలుగుతుందని అన్నారు. బాగు చేసే బాధ్యత యువత తీసుకోవాలని అన్నారు. ఎస్వి యునివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ రాజా రెడ్డి మాట్లాడుతూ సమాజంపై యువత ప్రభావం అధికంగా ఉంటుందని, నేటి యువత సే నో టు డ్రగ్స్ అనే నినాదంతో ప్రతి విద్యార్థి బాధ్యతగా సమాజం మధ్యానికి డ్రగ్స్‌కు తావు లేకుండా చూడాలని కోరారు. నేడు మీరు ఈ సదస్సులో వివరించిన అంశాలపై చర్చించి సోషల్ మీడియా వేదికగా మంచి మద్యంలేని సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ మాట్లాడుతూ తన వైద్య వృత్తిలో డ్రగ్స్ మధ్యానికి బానిస అయిన చాలా మంది పిల్లల తల్లిదండ్రులను వారి బాధలను చూశానని సమాజంలో పిల్లలు చేసే తప్పు వల్ల తల్లిదండ్రులకు చిన్న చూపు ఉంటుందని అన్నారు. మెడికల్ పరంగా ప్రస్తుతం అన్ని రకాల అడ్వాన్స్‌డ్ డి అడిక్షన్ వైద్యం అందుబాటులో వుందని అన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ బాలకృష్ణ మాట్లాడుతూ సమాజశ్రేయస్సుకు పునాదిగా యువత నిలవాలని విద్యార్థులకు అవగాహనా సదస్సులను ఏర్పాటు చేస్తూ చైతన్యం చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో రెక్టార్ శ్రీకాంత్ రెడ్డి, ఇసి మెంబర్ ద్వారకనాధ రెడ్డి, ఎస్ ఇ బి తిరుపతి అర్బన్ నాగరాజ రెడ్డి, పిఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ మంజుల, సికాం, డిహెచ్ఆర్, ఎస్వి జూనియర్ కళాశాలల ఇంటర్, డిగ్రీ విద్యార్థులు, అధ్యాపకులు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.3.45లక్షలు విరాళం



శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికి భక్తుల నుంచిప్రతి రోజూ భూరి విరాళాలు అందుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం కూడా శ్రీకాళహస్తికి చెందిన భక్తులు రూ.3.45 లక్షలు విరాళంగా అందించారు.ఇక్కడ ప్రతి రోజూ సుమారు పదివేల మంది భక్తులకు భోజన వసతి కల్పిస్తున్నారు. భక్తులు సమర్పిస్తున్న విరాళాలను బ్యాంకులో డిపాజిట్‌చేసి దానిపై వస్తున్న వడ్డీలతో భక్తులకు భోజన వసతి కల్పించారు. బ్యాంకుల్లో డిపాజిట్లపై వస్తున్న వడ్డీలతో ఒకరోజుకు సుమారు 10వేల మందికి భోజన వసతి కల్పించవచ్చు. అయితే ప్రస్తుతం 5వేల మందికి అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ధర్మకర్తల మండలి నియమించినతరువాత ప్రతి రోజూ నిత్యాన్న ప్రసాదానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల నుంచి కూడా విరాళాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి పట్టణం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన కోల్హాపూర్ భాస్కర్, కొల్హాపూర్ లక్ష్మీలు రూ.3,45,000లు నిత్యాన్న ప్రసాదానికి అందించారు. ఈ మొత్తాన్ని వారు ధర్మకర్తల మండలిచైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ద్వారా ఆలయాధికారులకు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఎఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి పాలకమండలి సభ్యులు సాధన మునస్వామి, జయశ్యాం తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన నేతి దీపాల అమ్మకాలకు అడ్డంకులు లేవు: చైర్మెన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి భావంతో వస్తూ ఇక్కడ దీపం వెలిగిస్తే మంచి జరుగుతుందని భావించే భక్తుల మనోభావాలను ఎవ్వరు అడ్డుకోవటం లేదని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సోమవారం స్పష్టం చేసారు. అయితే వారి మనోభావాలతో వ్యాపారాలు చేసి గుడి పేరు పట్టణం పేరుకు మచ్చ తీసుకురావద్దని మాత్రమే సూచిస్తున్నామని ఆయన స్పష్టం చేసారు. భక్తుల మనోభావాలతో కొందరు వ్యాపారులు అక్రమ వ్యాపారాలు చేస్తూ వారిని నిలువు దోపిడి చేస్తున్నారని ఈ వ్యవస్థను మార్చుటకు మాత్రమే ప్రయత్నిస్తున్నామని తెలిపారు.ఏ వ్యాపారి అయినా స్వచ్ఛమైన నేతిని విక్రయిస్తే నేతి దీపాలు అందిస్తే తాము వ్యతిరేకించటం లేదని వివరించారు. శ్రీకాళహస్తిలో భక్తులు అడుగుపెట్టి నప్పటి నుంచి అడుగడుగునా దోపిడి చోటు చేసుకుంటుందని తమ పరిశీలనలో తేలిందన్నారు.దాంతో దారికడ్డం పడుతూ భక్తులకు పూజలకు పనికి రాని వస్తువుల్ని అందిస్తూన్న వారిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. పోలీసులు అయితే భక్తులను అడ్డగిస్తూ వ్యాపారాలు చేస్తున్న 153 మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. కాబట్టి వ్యాపారులు స్వచ్ఛమైన నేతితో న్యాయమైన ధరలతో దీపాలను అందిస్తే ఎవ్వరూ అభ్యంతరం చెప్పమని చైర్మెన్ స్పష్టం చేసారు.

## ప్రతి రైతు ఈ కెవైసి చేయించుకోవాలి



తిరుపతిరూరల్, ఆగస్టు22 ప్రభాతవార్త: ప్రతి రైతు తప్పనిసరిగా ఈ కెవైసి చేయించు కోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి దొరసాని పేర్కొన్నారు. సోమవారం తిరుపతిరూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ పంచాయతీ లోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి, రైతులకు సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో దొరసాని మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసే వ్యవసాయం, ఉద్యాన పంటలను నమోదు చేసుకుని, తప్పనిసరిగా నమోదు చేసుకుని, రసీదు పొందాలని కోరారు. పిఎం కిసాన్ ఈకెవైసి చేసుకోని రైతులు ఇంకా ఏవరైన మిగిలి ఉంటే ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉన్నట్లు తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలో ఇంకా 2281 మంది రైతులు ఈకెవైసి చేయించుకోవాల్సి ఉందన్నారు. ఆర్ బి కె సిబ్బంది మొత్తం టాంటాం వేయించి రోజుకు రెండు గ్రామాల చొప్పున నేటి నుంచి పర్యటించి రైతులందరూ ఈకెవైసి చేయించుకునే విధంగా సహకరించాలన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఏడిఏ సుబ్రమణ్యం, ఏ.ఓ. మమత, ఆర్‌బికె సిబ్బంది, సోమశేఖర్‌రెడ్డి, హర్షిత, మురళి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రసూతి ఆస్పత్రిని నగరపాలక సంస్థకు కేటాయించకండి

-జిల్లా కలెక్టర్‌కు టిడిపి వినతి



తిరుపతి,ఆగస్టు 22 ప్రభాతవార్త: పలు రకాల అనారోగ్యబారిన పడిన మహిళలకు, గర్భిణీలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి భవనాన్ని నగరపాలకసంస్థ కార్యాలయంగా మార్చవద్దని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రసూతి ఆస్పత్రిని యధాతధంగా వుంచాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని టిడిపి నేతలు కలసి వినతిపత్రం అందజేశారు. వైద్యచికిత్సలకు, వైద్య అవసరాలకు మహిళలకు ఎంతగానో సేవలందిస్తున్న ఈ ఆస్పత్రిని తరలించరాదని, ఎక్కడ ఉన్నది అలాగే ఉంచేలా చూడాలని కోరారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో టిడిపి నాయకులు ఎం.సుగుణమ్మ, ఆర్‌సి మునికృష్ణ, సూరాసుధాకర్‌రెడ్డి, బుల్లెట్‌రమణ, శ్రీధర్‌వర్మ, వట్టికుంట శంకరనారాయణ, మహేష్‌యాదవ్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారుతున్నా..మాకు న్యాయం జరగడం లేదు



తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త :ఎన్నికలు వచ్చినపుడు మాత్రం ఓట్లు వేయించుకుని తమకు సమ స్యలు వచ్చినపుడు మాత్రం ఏనాయ కుడు కూడా పట్టించుకోవడం లేదని రైతులగా ఉన్న తాము రైతు కూలీ లుగా మారామని పలువురు తాటి పర్తి గ్రామస్తులు తిరుపతిలో జరిగిన జనసేన అధినేత నిర్వహించిన పవన్‌కళ్యాణ్ జనవాణి కార్యక్రమంలో తాటిపర్తి, కల్ళిపూడి గ్రామ రైతులు పవన్‌కళ్యాణ్‌కు విన్నవించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ 2008లో దివంగత మహానేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి సుమారు 200 కుటుంబాలకు భూములు ఇచ్చారని అయితే ఈభూములు తమకు తెలియకుండానే భూములు ఇచ్చిన 11నెలల్లోనే రద్దుచేశారని పవన్‌కళ్యాణ్‌కు విన్నవించారు. ఇక్కడ కజారియా సిరామిక్ టైల్స్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు భూమిపూజకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి తెలుగుదేశంపార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు విచ్చేసి శంకుస్థాపనచేశారని అప్పుడు తమ సమస్యను చెప్పుకునేందుకు వచ్చినా తమను పోలీసులతో కొట్టించారని పేర్కొన్నారు. ఇక తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్థానిక ఎంఎల్‌ఏగా ఉన్న బొజ్జలగోపాలకృష్ణారెడ్డికి కూడా విన్నవించామని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా తీరా గెలిచాక తమ సమస్యను గాలికి వదిలేశారన్నారు. అదేవిధంగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో కూడా జగనన్నకు విన్నవించామని ఏనాయకులు వచ్చినా తమ ఓట్లు వేసుకుని సమస్యను మాత్రం వదిలిస్తున్నారన్నారు. దీనిపై జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ స్పందిస్తూ సమస్యను పూర్తివివరాలతో తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు పేర్కొన్నారు.

## చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి

కుప్పం/రామకుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త : ఈనెల 24నుంచి కుప్పంలో మూడు రోజుల పాటు పర్యటించనున్న తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పర్యటనను దేశం శ్రేణులు విజయవంతం చేయాలని టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్యదర్శి మనోహర్ కోరారు. సోమవారం కుప్పం, రామకుప్పంలలో జరిగిన పత్రికా సమావేశాల్లో వారు మాట్లాడారు. ఈనెల 24న రామకుప్పం మండలం కొంగనపల్లి, కొల్లుపల్లి, చెల్దిగాని పల్లి, రామకుప్పంలలో అధినేత చంద్రబాబు పర్యటిస్తారన్నారు. 25న కుప్పంలో పార్టీ కార్యాలయ భవనం ప్రారంభం, కార్యకర్తలు, నేతలతో సమావేశమవుతారన్నారు. 26న కుప్పం, గుడుపల్లె మండ లాల్లో పర్యటించి బెంగళూరుకు వెళ్తారన్నారు. మూడు రోజుల పర్యటనను పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో కుప్పం నేతలు సాంబశివం, సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, త్రిలోక్, రామచంద్ర, రవి, విష్ణు, వసంతమ్మ, సుగుణమ్మ,రామకుప్పం నేతలు ఆనందరెడ్డి, ఆంజనే యరెడ్డి, మునస్వామి, చలపతి, సీతాపతి, నరసి ంహులు, శ్రీనివాసులు రెడ్డి, రామూర్తి, శ్రీరాములు, గంట్లగౌడు, టివి రవి, పద్మనాభరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 22 ప్రభాతవార్త: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి లక్ష్మీపురం వద్ద రోడ్డు దాటుతుండగా పాల వ్యాను ఢీకొని భువనేశ్వరి(32) మృతి చెందింది. మొగిలిమిట్టూరు గ్రామంకు చెందిన కృష్ణమనాయుడు భార్య భువనేశ్వరీ ఇండ్లీ పిండి రుబ్బుకొని ఇంటికి తిరిగి వస్తుండగా సర్వీసు రోడ్డులో వెళ్తున్న పాల వ్యాను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భువనేశ్వరీని చికిత్స నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు వున్నారు.

# స్కూల్ ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22 ప్రభాతవార్త : తిరుపతి టిటిడి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ముందరున్న శ్రీగోవిందరాజస్వామి హైస్కూల్ విద్యార్థులు వాహనదారుల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, గతంలో స్పీడ్ బ్రేకర్లు వుండేవని, కొత్త రోడ్డువేసి స్పీడు బ్రేకర్లు వేయలేదని ఆ స్కూల్ హెడ్‌మాస్టర్ డయల్ యువర్ కమిషనర్‌కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ అనుపమ అంజలి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ ఆ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేసి స్కూల్ జోన్ బోర్డ్ పెట్టాలన్నారు. సోమవారం జరిగిన డయల్ యువర్ కమిషనర్ స్పందన కార్యక్రమంలో కమిషనర్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొని అర్జీలు స్వీకరించారు. తిమ్మినాయుడుపాళెం వద్ద నున్న ఒక మాజీ జవాన్ తన ఫిర్యాదులో తన ఇంటికి పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరానని, అయినా స్పందించకుండా పన్ను చెల్లించమని అడుగుతున్నారని చెప్పగా, వెంటనే పరిశీలించమని ప్లానింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. కెనడీనగర్ నుంచి వచ్చిన ఫిర్యాదులో వారి ఇంటి ముందున్న చెట్టుకొమ్మలు తమ ఇంటిని తొలిచేస్తున్నాయని, వాటి వేర్లు వల్ల మురికి కాలువ పాడైపోయిందని చెప్పగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి స్పందనలో ఫిర్యాదు చేస్తూ రైతు బజార్ ముందర ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతున్న అక్రమ తోపుడు బండ్లను తొలగించాలని చెప్పగా, పరిశీలిస్తామని చెబుతూ ఎస్పీ కార్యాలయం కూడా సమాచారం ఇచ్చి వారి సహాయంతో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతవీధిలోని తమ ఇంటికి ఒక కుళాయి వుండగా రెండు కుళాయిలు వున్నట్లు పన్ను విధిస్తున్నారనే ఫిర్యాదుపై తమ సిబ్బంది వచ్చి పరిశీలించి తగు న్యాయం చేస్తామన్నారు. కొన్ని నప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలను తెలపగా వెంటనే శానిటేషన్ సిబ్బంది పంపించి క్లీన్ చేయిస్తామన్నారు. తాము హౌసింగ్ కొరకు లక్ష చెల్లించామని, ఇళ్లు రాలేదని,



కనీసం మేము కట్టిన డబ్బులన్నా ఇప్పించండని బేరివీధికి చెందిన వ్యక్తి అడగగా, ప్రభుత్వానికి మీ అర్జీని పంపిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఇ మోహన్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ సంబరాలు



కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త : ద్రవిడ వర్సిటీలో సోమవారం ప్రపంచ జానపద దినోత్సవ సంబరా లను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ జానపద దినోత్సవం జరుపుకోవడం వల్ల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేసేందుకు దోహదపడుతుందన్నారు. పూర్వీకులు అందించిన జ్ఞానమే భారతం, భాగవతం, రామా యణం, పురాణాలు, కావ్యాలు, నాటకాలు, నవలలు అయ్యాయన్నారు. జానపదం సాహిత్యం కాదని నిరాదరించిన రోజుల్లో బిరుదురాజు రామరాజు కాలికి బలపం కట్టుకుని జానపద గేయాలను వేలాదిగా సేకరించారన్నారు. ఈసందర్భంగా అమ్మవారికి పొంగళ్లు పెట్టారు. నంద్యాలకు చెందిన అమ్మయ్య బృందం బుర్రకథ, బైరెడ్డిపల్లి కళాకారులు నలతంగ కథను ప్రదర్శించారు. కోలాటలు, డప్పులతో కళాకారులు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రథమ మహిళ విజయలక్ష్మి, రెక్టార్ ఆచార్య అనురాధ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ అక్యుటర్ బాబు, ఇసి మెంబర్ ఆచార్య సుశీల, ఆచార్య వెంకటేష్, ఆచార్య శ్యామల, డా॥ మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో స్మారక ధర్మనిధి సదస్సు

తిరుపతి(విద్య), ఆగస్టు 22, ప్రభాతవార్త : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయన శాఖలో డా. మాలతీ చందూర్ స్మారక ధర్మనిధి సదస్సు సావేరి సెమినార్ హాల్‌లో నిర్వహించారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య దువ్వూరు జమున ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సదస్సు వలన మాలతీ చందూర్ గారి స్మృతులను స్మరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు శాఖాధ్యక్షులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనుభవాలు మాతో పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సలహాదారు డా. వై. సుభాషిణి ఈ సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ ఏ సంస్కరణలైతే మనం కోరుకుంటున్నామో వాటిని అరవైఏళ్ల క్రితమే మలతీ చందూర్ పేర్కొన్నారని కొనియాడారు.ఈ సదస్సు ఉపన్యాసకులుగా ఆచార్య వెలిదండ నిత్యానందరావు ఉస్మాని యా విశ్వవిద్యాలయం నడిచే విజ్ఞాన సర్వస్వం డాక్టర్ మాలతీ చందూర్ అనే అంశంపై మాట్లాడుతూ నన్ను అడగండి అని పాఠకులు అడిగిన ప్రశ్నలకు ఎన్నో సమాధానాలు ఇచ్చిన మాలతీ చందూర్ ప్రశ్నలు జవాబులు గురించి తెలిపారు. తమిరిశ జానకి రచయిత్రి, హైదరాబాద్ మార్గదర్శి డా. మాలతీ చందూర్ అంశం పై మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని ఏది గమ్యం ఏది మార్గం నవల గురించి, అవధానిలాగా సమాజంలోఎంతో మంది దాగి వున్నారంటూ ఎన్నిమెట్లెక్కినా నవల గురించి, చదివిన చదువును సార్థకం చేసుకోవాలని సద్యోగం నవల గురించి, విచక్షణా జ్ఞానాన్ని పొందుపరిచిన నవలగా కాంచనమృగం ఉందని వివరించారు. డా. పిసి వెంకటేశ్వర్లు అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్శిటీ తిరుపతి మాలతీ చందూర్ కథాసాహిత్యం -సామాజికత అనే అంశంపై మాట్లాడుతూ రచయిత్రిగా మాలతీ చందర్ వెలుగులోకి రాలేకపోయారన్నారు. విజేతులైన వారు తెలుసుకొన్న మాలతీచందర్ రచనా విశిష్టతను తెలియజేసారు. ఈ సదస్సుకి డీన్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ మేనేజ్మెంట్ ఆచార్య కె.అనురాధ, ఎడ్యుకేషన్ శాఖ, ఆంగ్లశాఖ, సోషల్ వర్క్ శాఖ అధ్యాపకులు ఎంఎ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు, పరిశోధన విద్యార్థినులు, న్యాయశాఖ, ఆంద్రోపాలజిశాఖ, ఎడ్యుకేషన్ శాఖ, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రాస్ సంస్థ రాజన్న కృషిని గుర్తించక పోవడం బాధాకరం

- కార్యాలయ హాలులో రాజన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- రాస్ మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ నవులూరి చెంగయ్య నాయుడు విజ్ఞప్తి

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 22 ప్రభాతవార్త : కొంత మంది స్వార్థపరులు రాస్ సంస్థను తమ స్వార్ధానికి వాడుకుంటూ వ్యవస్థాపక అధ్యక్షులను, సభ్యుల కృషిని గుర్తించక పోవడం బాధాకరమని రాస్ మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ నవులూరి చెంగయ్య నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధేయవాధి, ప్రజా సేవకుడు, పార్లమెంటేరియన్ పాటూరి రాజగోపాల్ నాయుడు రాస్ సంస్థను ఏర్పాటు చేయడమే కాకుండా సంస్థ ద్వారా బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, రైతులు, యువతను ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏపి కార్యక్రమాలు అమలు చేయవచ్చు వాటి, దరఖాస్తులు, ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేయించి నిధులు మంజూరుకు ఎంతో కృషి చేసేవారన్నారు. ఆ సమయంలో కార్య నిర్వాహక కార్యదర్శిగా గుత్తా మునిరత్నం ఉండేవారని తెలిపారు. రాస్ పాలక వర్గం చర్చించి నిర్ణయించిన అంశాలను మాత్రమే కార్యదర్శి అమలు చేసే వారన్నారు. రాస్ సంస్థ ప్రారంభం నుంచి దాదాపు 20 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేసి సంస్థ కార్యకలాపాలు, పాలక వర్గం బాధ్యతలను ప్రత్యక్షంగా గమనించిన వ్యక్తి తాను అన్నారు. అయితే కొంత మంది స్వార్థపరులు తామే రాస్‌ను స్థాపించి ముందుకు తీసుకుని వచ్చినట్లు ప్రగబ్బాలు పలకడం దారుణమన్నారు. అంతే కాకుండా రాజగోపాల్‌నాయుడు కుమార్తె మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర మనస్తాపం కలిగించడం తన మనస్సును తీవ్రంగా కలిసివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్ అభివృద్ధికి యుద్ధసైనికుల్లా పనిచేసిన వ్యవస్థాపక అధ్యక్షులు రాజగోపాల్‌నాయుడు విగ్రహాన్ని ఏర్పాటు చేయకుండా కార్య నిర్వాహకుడైన మునిరత్నం విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ విషయంలో ప్రజలకు నిజనిజాలు తెలియజెప్పడం నాపై ఎంతో ఉందన్నారు. అంతే కాకుండా ఇకనైనా నేటి పాలకవర్గం రాజన్నకు తగు గుర్తింపు ఇచ్చేందుకు కార్యాలయంలో హాలులో ఏర్పాటు చేసి రాస్ గొప్పతనాన్ని చాటాలని విజ్ఞప్తి చేశారు.

## పురవీధుల్లో గెరిగె ఊరేగింపు



పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో బజారువీధిలో వెలసిన గ్రామదేవత గంగమ్మకు సోమవారం ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం రెండో రోజు గంగజాతర సందర్భంగా గెరిగెను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## వైభవంగా పోలేరమ్మ జాతర నిర్వహణ

-ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త : సెప్టెంబర్ నెల 14,15 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామస్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించాలని మాజీ మంత్రి, ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జాతర నిర్వహణపై మున్సిపల్ కార్యలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలేరమ్మ జాతర కరోనా వల్ల రెండు సంవత్సరాల నుండి సక్రమంగా జరుగలేదన్నారు. అయితే ఈ ఏడాది వైభవంగా నిర్వహిస్తామన్నారు. భారీగా భక్తులు వస్తారని తెలిపారు. అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సంస్థానాదీశులు రాజయాచేంద్ర అమ్మవారిప్రతిమలను నలుదిక్కులు ప్రతిష్ఠించినట్లు తెలిపారు. అదేవిధంగాబారికేట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలేరమ్మ అమ్మవారిని తయారు చేసేచోట పోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికుల కోసంప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.14,15 తేదీల్లో మద్యపాన నిషేదం అమలు ఉంటుందని ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు.జాతర నిర్వహణకు సిఎం జగన్‌మోహన్‌ని నిధులు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు.సమావేశంలో గూడూరు ఆర్‌డిఒ మురళీకృష్ణ,జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజి చైర్మన్ మెట్టుకూరు దనుంజయరెడ్డి,జిల్లా గ్రందాలయ సమస్త చైర్‌పర్సన్ దొంతు శారద,చైర్‌పర్సన్ నక్క భానుప్రి,వైస్ చైర్మన్ బాలయ్య,కమీషనర్ గంగాప్రసాద్,తాసిల్దార్ శ్రీనివాసులు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చిన్న వయస్సు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి: ఆర్.డి.ఓ



గూడూరు,ఆగస్టు 22 ప్రభాతవార్త : చిన్న వయస్సు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకో వాలని గూడూరు ఆర్డీఓ మురళీకృష్ణ విద్యార్థు లకు పిలుపునిచ్చారు.సోమవారం గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీ స్పోర్ట్స్,అండ్ గేమ్స్ ట్రస్ట్,ది గూడూరు క్రికెట్‌క్లబ్,అల్లూరు ఆదిశేషా రెడ్డి క్రికెట్‌క్లబ్,హరిచంద్రారెడ్డి క్రికెట్‌క్లబ్ ఆద్వర్యంలో ఇన్టర్ స్కూల్ క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మురళికృష్ణ హజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూడూరులో క్రీడాకారులకు ఎన్నో మంచి అవకాశాలు కల్పిస్తున్నారని ప్రతి ఒక్కరు చిన్నవయస్సు నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని శారీరకంగా, ఆరోగ్యపరంగా ముందుకు సాగాలన్నారు.ఈకార్యక్రమంలో కిరణ్‌చక్రవర్తి,కార్యదర్శి రవికుమార్, సీనియర్ రొటేరియన్లు పిడిజి కొనిదల మునిగిరీష్, బి.దశరథరామిరెడ్డి, ఎ.శ్రీనివాసాచారి, పి.రవీంద్రరెడ్డి, పి.హరిప్రసాద్, సి.రామకృష్ణ, స్వరూప్, యుస్‌వి.అశోక్‌చక్రవర్తి, ఎన్.బాలకృష్ణంరాజు, టి.సురేష్‌రెడ్డి, జిజి.నాయుడులు హాజరయ్యారు.

## ఈ-పంట నమోదు గడువులోపు పూర్తి చేయాలి

- జేసీ డీకే బాలాజీ

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 22 ప్రభాతవార్త : ఖరీలో సాగైన పంటలను పగడ్బందీగా ఈ-పంట నమోదు కార్యక్రమం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సాయంత్రం నుంచి ఆర్‌డీవోలు, తహశీల్దార్లు, అగ్రకల్చర్ అధికారులతో ఈ-క్రాపింగ్, మ్యూటేషన్, పీవోఎల్ఆర్, రీ సర్వేల, కోర్టు కేసులు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ - పంట నమోదు కార్యక్రమంకు సంబంధించిన పనులను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులు దృష్టిపెట్టి పూర్తి చేయాలని తెలిపారు. పంట నమోదు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 83,942 ఎకరాలకుగాను 36,201 ఎకరాల పంట మాత్రమే నమోదు పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 36978 ఎకరాలు పంట నమోదు పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ-పంట నమోదు సంబంధించి సాంకేతిక సమస్యలు ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రీ సర్వే పనులలో భాగంగా గ్రౌండ్ వ్యాలిడేషన్, గ్రౌండ్ ట్రూతింగ్ పనులపై సంబంధిత అధికారులు దృష్టి పెట్టి పూర్తి చేయాలని తెలిపారు. మ్యూటేషన్‌కు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత గడువు లోపల పూర్తి చేయాలని తెలిపారు. ఏఎంసీయూ, బీఎంసీయూ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2300 పైగా కోర్టు కేసులు ఉన్నాయని, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. కోర్టు కేసుకు సంబంధించిన అభ్యంతరాలు ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నీటి వనరుల పనులలో భాగంగా పంచాయతీ సెక్రటరీ, ఇరిగేషన్ అధికారులు రెవెన్యూ గ్రామాల వారీగా పరిశీలించి ఆర్‌డీవోలతో సమన్వయం చేసుకుని పనులను పూర్తి చేయాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పశువర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఏడీ సర్వేయర్ జయరాజ్, జిల్లా వ్యవసాయ అధికారిణి దొరసాని, తదితరులు పాల్గొన్నారు.